

"ఓ లెమ్మోయీ! కాఫీ తపస్వి దిశ లాలేఖ్యంబుగా మారె, పాత్రమ్మున్ నింపుము స్ప్రాంగగు కాఫీ రసంబునన్. . . . . ." అని శర్మ శేషు నుద్దేశించి భూపాలరాగంలో ప్రత్యూష ప్రబోధం చేస్తున్నాడు.

"ఉండ్రా! పానకంలో పుడకలాగ మంచికలను పాడు జేస్తున్నావ్!" అని శేషు విసుక్కున్నాడు రెండోవేపు తిరిగి పడుకుంటూ.

ఒక లానాటిపుస్తకంలోంచి తలెత్తకుండానే వర్మ "ఒరే! వివాహం కాంట్రాక్టు అయితే విడాకులు టార్ట్సుల క్రిందికి జమ వస్తుందా?" అని ప్రజల నుద్దేశించి ఒహ ప్రశ్నా బాణాన్ని విసిరాడు.

శర్మ మొహం అద్దంలో చూసుకుంటూ, "నువ్వు ప్రశ్నించేది నన్నేనా?" అనడిగాడు.

వర్మ "నిన్నుగాక మరి కలలుగంటున్న ఆ శేషు నడిగాననుకుంటున్నావా? లేక గోడర్ని ప్రశ్నించా ననుకుంటున్నావా?" అని బోల్డు కోప్పడిపోయాడు స్నేహితుడిమీద.

"నీ ప్రశ్నకు ఏ సాల్మన్‌వంటి మహానుభావుడో జవాబు చెప్పాలోయ్! నేను చెప్పలేను. పైగా చదువుమీద నా కేమంత విశ్వాసంలేదు" అన్నాడు శర్మ

"ఔ నౌను. ఆ విషయం నాకు తెలీదు గనకనా!" వర్మ అతడితో ఏకీభవించాడు.

"అనుభవం ద్వారా మంచి విద్య అలవడుతుందని నా విశ్వాసం. ఇప్పుడు నువ్వు భట్టీయం వేసిన ఈ చదువంతా జీవితంలో ప్రవేశించాక దమ్మిడికి కొరగాదు ఎలాగూ బీయల్ పాసయాక బోర్డు తగిలించుకుంటాంకదా!! అప్పుడే "లా" పుస్తకాలన్నీ క్షుణ్ణంగా చదువుకోవచ్చు. ఇప్పటినుండే వృథాశ్రమ ఎందుకు?"

"నీ అభిప్రాయంప్రకారం నడచుకుంటే బోర్డు కాదుగదా, మెడలోచాట తగిలించుకోవాలి" అన్నాడు వర్మ పుస్తకాన్ని టక్కున మూసేస్తూ.

"పోనీయవోయ్! నా అభిప్రాయాలు నావి. నాబోటి వెర్రి పీనుగొహడు పరీక్ష ఫెయిలయితే దేశానికేం నష్టం?"

"నిజమే! దేశానికేం నష్టం? నీకుగాని!"

"అంత సంకుచితంగా మాటాడుతావేమిటోయ్! పది హేడో శతాబ్దంలో వున్నట్టు!! నీవు సక్సెస్‌ఫుల్ లాయరు కాదలచుకున్నావా, ఈ మంత్రం విను. ఇది నా కొహాయన చెప్పాల్లే జాగ్రత్తగా వినుస్మీ. కోర్టులో వాదించేప్పుడు లాపాయింటు నీ పక్షానవుందనుకో. మోతెక్కిపోయేలా జడ్జీ చెవుల్లో ఆ పాయింటు మోగించు. లేదా మాంచి సాక్ష్యం నీ పరంగావుందనుకో. జూరీ హడలి పోయేలా వారి చెవుల్లో ఈ విషయాన్ని మ్రోగించు! ఇంతే సూత్రం!"

"మరి లాపాయింటూ సాక్ష్యం రెండూ లేక పోతే?"

"అప్పుడు టేబిల్‌మీద గట్టిగా మోగించు. నీదే గెలుపు"

శేషు తక్షణంలోనే కళ్ళువిప్పి కోపంగా శర్మ కేసిచూస్తూ, "ఓరే! కాసేపైనా సుఖంగా పడుకోనీకుండా ఏం అరుస్తున్నావురా చెవలాయీ!" అన్నాడు.

"చెవలాయికాదురా! వాడు చె. వ. లాయరు" అన్నాడు వర్మ గుడ్లు మిటకరిస్తూ, అవ హేళనగా.

"దయచేసి వివరించ ప్రార్థన" అన్నాడు వర్మతో శర్మ.

"చె. వ. లాయరు అనగా "చెడవదరుబోతు లాయరు" అని అర్థం!" అని వర్మ విడ మర్చాడు. శర్మకు ఏమనాలో తెలీక కోపంగా వాడివేపు క్షణ కాలం చూశాడు. వర్మ ఆ చూపుకి గజగజ వణకలేదు. శేషు నిట్టూరుస్తూ, "ఇద్దరు కలిసి మాంచికలను పాడుజేశార్రా!" అని విచారించాడు.

"నాయనా, శేషూ! . . . . ."అని శర్మ తన లెక్చరు ధోరణి అరంభించబోయాడు.

"చాలించరా, గోల!" అడ్డొచ్చాడు శేషు.

"మాంచి కల అనడమేగాని మాతో చెప్పి ఏడుస్తేగా!" అన్నాడు వర్మ.

"గాయకుడు:-నా పాటకచ్చేరి వినుటకు చాలామంది గుమి గూడి నట్లుందే!

ఎదుటివ్యక్తి:- వచ్చిన వాళ్ళం దరూ గాడిదలను పోగొట్టుకొన్న చాకలివాళ్ళే గదా!!

జి. వి. శ్రీధర్. (మద్రాసు)

"పోవోయ్! నీతో చెబితే ఆర్చేవాడివా, తీర్చే వాడివా?" అన్నాడు శేషు చులకనగా.

శర్మ సంభాషణలో చోటు చేసుకుంటూ, "పోన్లే! వాడు తీర్చలేకపోతే నేను తీర్చగలనుగా!" అన్నాడు.

"ఆ! బోడి! మహాతీర్చావులెద్దూ!!" మరింత ఎత్తేశాడు శర్మని శేషు.

"ఒరేయ్! నాతోనున్నటా! అలా మాటాడేదీ! చిన్నా పెద్దా భేదం లేదూ? సాయంత్రం లోపలే నువ్వు నా దగ్గరకి పరుగెత్తుకురాకపోతే చూడు" అన్నాడు శర్మ తన కేదో ఇతరుల కష్టాలు తీర్చడమే పని అయినట్టు.

వర్మ "అర్చగలిగితేనే నీ కల వినాలన్నమాట. లేకపోతే వినకూడదా?" అనడిగాడు.

"ఎందుకు వినకూడదూ? నే జెబుతావిను వాడికల" అన్నాడు శర్మ వర్మ నుద్దేశించి.

"శభాష్! ఇది మరోపోజు! చెప్పు చూదాం చాతనయితే" ఛాలెంజి చేశాడు శేషు.

"చెబుతావిను. అరే వర్మా! పూర్వకాలమున నొకానొక నూరిలో వంకీలజుత్తుగలవాడును, ధరింపబడిన టిప్‌టాప్ దుస్తులు గలవాడును, ఫలానా మహా నగరంలో చదవబడుచున్న బీయల్ క్లాసువాడును అగు శేషు అను నొక కుర్రవాడుండెను."

"సరే! ఈ కథ ప్రజలందరికీ తెలుసు" అన్నాడు వర్మ.

"ఇహ తర్వాతది వినుము, సదరు—అనగా పై జెప్పబడినశేషు అనువాడు మనోహరరూపముగలదియును, నిత్యద్విజటాధారియును, సౌందర్యమకుట దివ్య కిరణ సందీప్తయును, సదరు శేషుకు పై జెప్పబడిన బీయల్ క్లాసుతో మేటును అయిన ఉషాదేవిని ప్రేమించెను"

శేషు దిగ్గున లేచి కూర్చున్నాడు. "హోర్! ఎలా వూహించావురా?" అనడిగేశాడు ఆశ్చర్యం పట్టలేక.

"గాలినిచూసి పసికడతానోయ్ బ్రదర్! సామాన్యుడిననుకున్నావేమో!" అన్నాడు శర్మ మోర విరుచుకోబోయి ప్ర మా ద ం జరుగవచ్చునని త త్ప్రయత్నం విరమించుకున్నవాడై.

శేషు, "ఎలా తెలుసుకున్నావురా?" అని తిరిగి ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"మరోటి చెబుతా వినురా వర్మా! ఈ కథా నాయకుడు వో పుస్తకాలకట్టను నిన్న కాలేజినించి మోసుకొచ్చాడు. సదరు కట్టను యజమానురాలు ఉషాదేవిగార్కి సమర్పించబోతున్నాడు. ఆ కట్టను ఆమె నిన్న కాలేజిలో మర్చిపోయింది."

శేషగిరి గబగబా లేచాడు. "నిజమేబ్రదర్! ఈ రోజు ఎనిమిది గంటలకే ఉషాదేవి ఇంటికెళ్ళి పుస్తకాల కట్టయిచ్చివద్దామనుకున్నాను. కానీ కమ్మని కలలుకంటూనే కాలం గడిపేస్తున్నాను. నేనిరోజు పుస్తకాలకట్టను ఉషాదేవికిచ్చిరావడం నా ప్రణయ పథంలో ముఖ్యమైన మైలురాయిరా!" అన్నాడు.

శర్మ గంభీరంగా—ఒక సర్వజ్ఞుడు పసివాని అమాయకత్వాన్నిచూసి నవ్వినట్టు— నవ్వాడు. "అంత తేలికకాదురా బ్రదర్! నీ ప్రణయపథంలో 'ఇక హద్దుమీరి నడచువారు శిక్షింపబడుదురు' అనే బోర్డువుంది. తెలుసుకో!" అన్నాడు.

శేషు బ్రష్షుమీద టూతుపేస్టు వేసుకుంటూ, "తేలికకాక ఏమవుతుందిరా! వాళ్ళనాన్న వీధుల్లో చేతులమీద నడిచే రకమా?" అనడిగాడు.

"కాదు" అన్నాడు శర్మ.

"ఔను! నేనూ అతడెప్పుడూ చేతులమీద నడవడం చూల్లేదు" అని వర్మ ఒప్పుకున్నాడు.

"పోనీ వాళ్ళింట్లో క్రూరమైన కుక్కలున్నాయా?"

"లేవనే నా విశ్వాసం"

'లేదా వాళ్ళబామ్మ బీబీసీఅని రిపోర్టులొచ్చాయా'

"బీబీసీ అంటే ఏవిటోయ్?" వర్మ ప్రశ్నించాడు

"ఓరి అమాయకుడా! బీబీసీ అనగా "అసత్య ప్రచారక సంఘం" అని అర్థం తెలిసిందా!" అని శర్మ, "ఆ బామ్మ విషయంలో నీవు నిశ్చింతగా వుండవోయ్ శేషూ!" అని భరోసా యిచ్చాడు.

"మరయితే చిక్కెక్కడ?" అనడిగాడు శేషు.

"చిక్కెక్కడంటావా? విను. నీ ప్రేమ రోజా

(55వ పేజీ చూడండి)

పూలబాటలోఓ కంటకముంది? నీ ప్రణయపాన కంలో ఓ పుడకవుంది!! నీ అనురాగనేత్రంలో బాధించే ఓ నలుసుంది!! జాగ్రత్త!'' అన్నాడు శర్మ

"అయితే ప్రేమ అనే వస్తువుకూడా కల్తీగా బజార్లో చిక్కుతుందన్నమాట!'' అని వర్మ ఒక అమోఘమైన సత్యాంశాన్ని బయటపెట్టాడు. విస్తుపోయి నిలుచుండిన శేషునుచూసి శర్మ మరింత గంభీరుడై, "అవున్రా! మన క్లాస్మేటు రఘునాథ్ లేడూ! వాడే నీ కంచంలో రాయి, నీ మంచంలో నల్లి నీ కథలో విలన్'' అన్నాడు.

"ఏమిటేమిటి?'' అని వర్మ ఆశ్చర్యపోయాడు. ద్విపాత్రాభినయం గురించి అతడు విన్నాడుగాని, ఒకేసారి ఒకడు మూడు పాత్రలెలా ధరిస్తాడో అతడికి తెలీలేదు.

"అంటే.....??'' అర్థంకాక శేషు ప్రశ్నించాడు

"అంటే, ఉషాదేవిని వాడు కూడా ప్రేమిస్తున్నాడన్నమాట. శత విధలా ఆమె మెప్పు సంపాదించాలని తాపత్రయపడుతున్నాడు. ఆమె ఇంటి కెదురుగానే ఓ రూము కూడా సంపాయించాడు ఈ రోజు నువ్వు ఉషాదేవి యింటికెళ్లొచ్చావంటే నీమీదా ఓ కన్నేసివుంచుతాడు!''

"ఆఁ! వాడు నన్నేం చేస్తాడులెద్దూ!'' అన్నాడు శేషు.

"అలాని సంతోషపడొద్దు. ఈ రఘునాథ్ అనే వాడిముందు రాబిన్‌హుడ్లూ కేప్టెన్‌కిడ్లూ అనే వాళ్ళంతా బలాదూర్!! ఏమనుకున్నావో!''

"అబ్బ! ఇవన్నీ నీకెలా తెలిశాయిరా?'' అని వర్మ వాణ్ణి ప్రశ్నపూర్వకంగా మెచ్చుకున్నాడు శర్మ సర్కస్‌లో కత్తులు మింగేవాడిలా. "అది అనుభవంలే!'' అని తేలిగ్గా అనేశాడు శేషు మారు మాటాడకుండ బాత్ రూంలో కెళ్ళాడు!

* * * *

శేషగిరి పుస్తకాలకట్ట పట్టుకొని గేటుదగ్గర కొచ్చాడు జాగ్రత్తగా పరకాయించి చూశాడు "కుక్కలబోర్డు''కోసం! అటువంటిదేమీ కనబడక పోయేసరికి ధైర్యం తెచ్చుకొని గేటు తలుపు తెరిచాడు. అందమైన పూల మొక్కలూ, రంగు రంగుల క్రోటన్సూ, పచ్చని పచ్చికా స్వాగతం పలికాయి వసంతవనిలోనికి వసంతుడిలా లోనికడుగు పెట్టి ఓ విప్లవ మహారాజులా ముందుకి నడిచా.

గుమ్మదగ్గరకొచ్చి నిలబడ్డాడు చూట్టాని కెవరూ కనబళ్లేదు "ఏమండీ! ఉషాదేవిగారున్నారా!'' అని గట్టిగా పిలవబోయాడు కాని మాటలు గొంతు పెగిలి రాలేదు మన దేహంలో సహకార సంఘముందో లేదో తెలీదు ఒకవేళ ఉంటే ఈ సారి ఆ సంఘాన్ని సమావేశపరిచి అత్యవసర పరిస్థితుల్లో సహకారం చూపనందుకు ఈ గొంతుకను గట్టిగా మందలించాలనుకున్నాడు

ఇంతలో ఓ పని మనిషివచ్చి, "ఎవరు కావాలి బాబుగారు?'' అని ప్రశ్నించింది ఒక జంతు శాస్త్రవేత్త కొత్త జంతువుని పరిశీలించినట్టు తనవేపే పరకాయించి చూస్తూ

శేషు ధైర్యాన్ని కూడదీసుకొని, "మిస్ ఉషా

# ఘంటారావం

(9-వ పేజీ తరువాయి)

దేవిగారున్నారా?'' అని ప్రశ్నించాడు తన గొంతు ఇంత దారుణంగా పని చేసినందుకు సంతోషించాడు కూడా

"ఉన్నారు. కూకోండి బాబూ పిలుస్తాను'' అని ఆమె లోని కెళ్లబోయి వెనక్కితిరిగి "మీ పేరేటండి బాబుగోరు?'' అని ప్రశ్నించింది.

శేషుకు యీ ప్రశ్న అనవసరమనిపించింది పైగా ఆమె ప్రశ్నించే ధోరణి కూడా అతనికి కోపాన్ని తెప్పించింది. అందుచేత అయిష్టంగానే "నా.... పేరు .. ..ష్! . శేషగిరి....అన్నాడు.

"ష్! శేసగిరాండి?'' అని కుతూహలంగా ప్రశ్నించిందామె

"ష్‌శేషగిరేమిటి?''

"మీరేకదటండిబాబు పేరడిగితే ష్ శేసగిరన్నారు!''

"ష్! శేషగిరి అనలేదే!'' అన్నాడు మొండిగా.

భార్య:-పెళ్లి కాకముందు నా గురించి మీరు పడిన శ్రమను తలచుకుంటే, నాకు ఎక్కడలేని నవ్వు వస్తుంది.

భర్త:-అనవసరంగా ఎందుకంత శ్రమపడ్డానా అని యిప్పుడు విచారిస్తున్నాను.

సి హెచ్. కుసుమ (గుంటూరు)

"ష్! శేసగిరని, ష్ శేసగిరని అనలేదంటారేటి బాబు?'' అని ఆమె మరీ మొండికెత్తింది

తన పేరు నిలా చిత్రహింస చేస్తున్నందుకు దారుణంగా బాధపడి, "అంటే అన్నానులేగాని, నా పేరులో మూర్ధన్యమైన షత్వమున్నదిగాని దంత్యమైన సకారంలేదని తెలుసుకో!'' అన్నాడు కోపంగా.

"ఏటో సిత్రంగా మాటాడుతున్నారు బాబూ'' అంటూ లోనికెళ్ళిపోయింది

శేషగిరి కూర్చుందామా వద్దా అని కాసేపు తటపటాయించాడు చివరికి ఉషాదేవి దర్శనమయే వరకూ కూర్చోరాదని నిశ్చయించుకున్నాడు

నీలిటిష్యూచీర, నీలి చారల బ్లవుజూ వేసుకొని, ఉదయాన్నే వికసించి తాజాతనంతో సొంపు లొలుకుతున్న పుష్పంలా ఉషాదేవి నడవాలోంచి నడిచి వచ్చింది చీకట్లవంటి నల్లని కురులూ, ప్రత్యూషపు అరుణకాంతులుగల పెదిమెలూ, బుగ్గలూ ఉషాదేవి కాబట్టి ఆమెకు సహజంగానే అమరినై. ఆమె గిరుక్కున శేషగిరివేపు తిరిగింది. ఆ తిరగడంలో పాములాంటి ఆమెజడ నడుంచుట్టూ చుట్టి మరలా వాలిపోయింది

"ఓ మీరా! రండి! మీ కోసమే ఎదురు చూస్తున్నాను!'' అందామె చిలిపిగా శేషునుచూసి నవ్వుతూ. శేషు వెన్నెముకలో జివ్వున ఓ చలితెర సాగిపోయింది. తనకోసం ఉషాదేవి ఎదురు చూడడమా! ఎంత అదృష్టవంతుడు తను! ఎక్కువ పంట పండించినందుకు ప్రభుత్వ బహుమతి సంపాదించిన కర్షకునిలా మురిసిపోయాడు

జడను మునివేళ్ళతో చికాకుపరుస్తూ, ఉషాదేవి, "ఆ పుస్తకాలనలా వుంచండి!'' అని ఒక టేబిల్ నిర్దేశించి చూపింది. తానొక కుర్చీలో కూర్చుంది. శేషగిరి బుద్ధిగా పుస్తకాలనలావుంచి, మళ్ళీ బుద్ధిగా నిలబడ్డాడు

"కూర్చోండి!'' అందామె కూర్చున్నాడు

"చాలా శ్రమపడ్డారండి! థాంక్స్!'' అన్నదామె

"నాకా...మాకా .. '' అన్నాడు శేషగిరి. అంటే అతడు రాకెన్‌రోల్ నృత్యంచేసే వుద్దేశంలో వున్నాడనికాదు లేదా మిస్ ఉషాదేవికి కొంకిణీ భాషతోగల పరిచయాన్ని పరీక్షిద్దామనే వుద్దేశమున్నాకాదు కేవలం అతని గొంతు పై జెప్పిన సహకార సంఘంలో మెంబరుగా లేకపోవడమే దానికి కారణం

"అంటే?'' అని ప్రశ్నించింది ఉషాదేవి కుతూహలంగా. తానొక పొడుపుకథ వేస్తున్నట్టు ఆమె భావించిందేమోననుకున్నాడు

"కా ... షా!'' అన్నాడు ఎంతగా గొంతుకు సర్దుకున్నప్పటికీ, ఈ రెండు ముక్కలుతప్ప బయటికిరాలేదు అవి తన ప్రయత్నం లేకుండానే స్వతంత్రించి బయటకు వచ్చేశాయి.

"మీరు భలే చిత్రమైనవారేనే!!'' అంది ఉష ఆశ్చర్యంతో సంతోషాన్ని కలుపుతూ శేషగిరి గుడ్లప్పగించి ఆమె వంకే చూస్తున్నాడు మళ్ళీ ఆమె ఏదేనా ప్రశ్నవేస్తే తన గొంతులోంచి ఏ ధ్వనులొస్తాయోనని భయపడుతున్నాడు లోపలే

"చాలా చిత్రమైనవారండీ!'' అన్నది ఉషాదేవి మరోసారి "సరేగాని, "సత్తువుంది కారంలేదు'' అంటే ఏమిటండీ?'' అని ప్రశ్నించింది ఎంతో కుతూహలంతో

తాను వేసిన చిక్కు ప్రశ్నకు మారుగా ఆమె ఈ చిక్కుప్రశ్నవేసి వుంటుందేమోనని ఊహించాడు తాను చిక్కు ప్రశ్న వెయ్యకపోయినా ఆమె వేసిందిమాత్రం నిజంగా కొరకరానికొయ్యనిపించింది ఆఖరుకు "స్ఫింక్స్'' వేసిన చిక్కు ప్రశ్న కూడా ఈ ప్రశ్నముందు బలాదూర్ అనిపించింది

"తెలీదు'' అన్నాడు ఎలాగో పీలు వేసుకుని.

"ఆశ్చర్యంగావుందే! మీకే తెలియదా!!'' అన్నది ఉషాదేవి శేషగిరి ధైర్యంగా తల తాటించాడు

"మరి మా పనిమనిషితో మీరే అన్నారటగా యీ మాట?'' అనడిగిందామె శేషగిరికి అర్థమైంది కాని అతడేం మాటాడలేదు వాళ్ల పని మనిషితో తాను వ్యాకరణ విషయాలు చర్చించానంటే ఆమె ఏమనుకుంటుందోనని భయపడ్డాడు.

కాసేపుండి ఉషాదేవి, "మీరు ఐదవవారు!'' అన్నది శేషగిరి, "అరే! ఈమె కూడా చిత్రంగా మాట్లాడుతుందే!'' అనుకున్నాడు. తనను ఎందు

దేశభాషావారపత్రికలలో సర్క్యులేషన్ ప్రకారం
'ఆంధ్రసచిత్రవారపత్రిక' ఐదవస్థానం ఆక్రమిస్తున్నది.



"హయ్యో! గబుక్కు నెవరైనా వస్తే
ఇవ్వచ్చని అట్టేపెట్టానండీ ఆ
**కిసాన్** స్క్వాష్ సీసా!"




**ముందు జాగ్రత్త ఉన్న** ఇల్లాళ్ళందరూ, గబుక్కున ఇంటి **కెవరైనా అతిథులువస్తే** ఇవ్వడానికని ఎప్పుడూ అదనంగా **ఒక "కిసాన్ స్క్వాష్"** సీసా వేరే అట్టేపెట్టి ఉంచుతారు. **చెట్టునముగ్గిన** వళ్లనుంచి తీసిన ఈ రసంలో బలవర్ధకాలైన **విటమినులు** పుష్కలంగా ఉంటాయి. ఏడాది పొడుగునా **ఏకాలమైనా** ఈ పళ్ళరసం ఇవ్వచ్చు. పుచ్చుకోనూవచ్చు. **మరచిపోగలరు!** ఎప్పుడూ మీ యింట్లో రెండు మూడు **సీసాలు అట్టే**పెట్టి ఉంచుకోండి. ఆరెంజి, లెమన్ **కాక మరి అరురకాల** పళ్లరసాలున్నాయి.

**కిసాన్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, బెంగుళూరు**

JWT-KP 1315

తున్నదేవిటి? కొంపదీసి ఈమె సహస్ర శిరచ్ఛేద అపూర్వచింతామణికాదుకదా! అనుకున్నాడు ఆందోళనగా.

"అంటే?" అని ప్రశ్నించాడు ఎలాగైనా వివరాలు తెలుసుకుంటే మంచిదని.

"నా పుస్తకాలకట్టను తెచ్చివ్వడంలో మీరు అయిదవవారన్నమాట!" అన్నది ఉష.

"పాపం! పుస్తకాలకట్టను తరుచుగా కాలేజిలో మరచిపోతుంటారు గామోసు!" జాలి చూపుతూ అన్నాడు శేషు.

"మరచిపోతాను నిజమే! కాని మతిమరపువల్ల కాదు. కావాలనే మరచిపోతాను!" అన్నది అతడి కళ్లలోకి చూస్తూ ఉషాదేవి.

"కావాలని ఎందుకు మర్చిపోతారు?"

"పుస్తకాలు కాస్త ఎక్కువగా వున్నప్పుడు మోసుకురావడం కష్టమైతే, వాటన్నిటినీ మంచి రిబ్బనుతోకట్టి, కాలేజిలో వదిలేసి చేతులూపుకుంటూ చక్కా నడిచి వస్తాను మరుచటిరోజు ఉదయానికల్లా ఎవరో ఓ అబ్బాయి నా పుస్తకాల కట్టను నాకు తెచ్చిస్తాడు. ఇదివరకు నలుగు రిలాగే తెచ్చిచ్చారు?" అన్నది ఉష.

ఏదేనా యంత్రాన్ని ఉపయోగించి మానవుడి మొహాన్ని నయాపైసా సైజులోకి నొక్కేయుడానికి అవకాశముందో లేదో తెలీదు. కాని ఈ మాటలవల్ల శేషు మొహం సరిగ్గా నయాపైసా పరిమాణంలోకి వచ్చింది. అంచాతనే ఎగిరి గంతేసి "శహభాష్! మీ తెలివి అపూర్వం!" అని ఉషాదేవిని అభినందించలేకపోయాడు. కోపంతోనూ, ఆవేదనతోనూ, మొహానికి పట్టిన చెమటను చేతి రుమాలుతో తుడుచుకున్నాడు.

"మన కాలేజిలో ఎలక్ట్రిక్ బెల్నుంది చూశారా?" అనడిగింది ఉష.

శేషగిరి ఆమె భావాల్తో సరిగా పరిగెత్తలేకపోతున్నాడు. మనోవేగం సంగతి ఇంతకుముందు వినివున్నాడుకాని అది యింత వేగంగా వుంటుందని అతనికి తెలియడం ఇదే మొదటిసారి.

"చూశాను" అన్నాడు రుమాలుతో నుదుర్ని తుడుచుకుంటూ.

"మేడమీద ఆఫీసులో స్విచ్చి వుంది అవర్ అయిపోగానే అది నొక్కుతారు. వెంటనే అన్ని క్లాసుల్లో గంటలు మ్రోగుతై. ఆ స్విచ్చిచూశారు కదూ?"

చూశానని వప్పుకొన్నాడు. రు. తోను. ని ఓ గా తుడుచుకున్నాడు.

"ఆ స్విచ్చి మీరు నొక్కగలరా?" అనడిగింది. వట్టి అర్థంలేని ప్రశ్నల లిస్టు తయారుచేస్తే ఈ ప్రశ్న మొట్ట మొదటగా వస్తుందేమోననుకున్నాడు శేషు. "ఎందుకూ?" అని ప్రశ్నించాడు.

"నాకు తెల్సు. మీరీ ప్రశ్న అడుగుతారని!" అంది ఉష వెటకారంగా.

"మరేమని అడగాలి?"

"మీరు ధైర్యవంతులైతే" ఓ యస్! రేపు పెకెండవరు జరుగుతున్నప్పుడు మధ్యలోనే ఆ

స్విచ్చి నొక్కేస్తారు చూడండి!" అని వుందురు! అన్నది ఉష ఉద్రేకంగా. ఛ,ఛ! ఎంత అవమానం! ఒక అబల తను నిర్బలుడని తూలనాడడమా? ఎంత దౌర్భాగ్యం! అయినా శేషు భయపడుతూనే, "అలా నొక్కినందువల్ల లాభం?" అనడిగాడు.

"లాభమేముంది? ఇదేమన్నా వ్యాపారమా, లాభం రావడానికి? కాని ధైర్యవంతులకి అల్పాంచరంటే ఎంతో యిష్టం. అపాయకరమైన పనులుచేస్తే ఎంత ఆనందం కలుగుతుంది!!" అంది ఉష.

శేషగిరి కాస్త ఆలోచించాడు. నిజమే! ధైర్యం!! ధైర్యం వుండాలి. ప్రేమించిన పడతికోసం ప్రాణాలిచ్చి, అగ్నిలోకిదూకి, రాక్షసుల్నిచంపి, ఇంకా ఎన్నెన్నో సాహసకృత్యాలు చేసిన మహావీరులైన హీరోలుండగా తాను ఒక ఆఫీసు రూంలోవుండే బెల్ * స్విచ్ నొక్కలేకపోతాడా!!

"ఓ యస్! రేపు రెండో గంట జరుగుతున్నప్పుడు మధ్యలో దాన్ని నొక్కేస్తాను!" అన్నాడు శేషగిరి ధైర్యం పుంజకుని. ఉషాదేవి చెప్పిన హీరోలాగ్గానే మాట్లాడాడు.

ఉష చప్పట్లు చరిచింది. "భలే భలే! మీరు స్విచ్ నొక్కుతారా!! రేపు సెకెండవరు జరుగుతున్నప్పుడా!!" అన్నది ఆనందంలో అనిర్వచనీయమైన కాంతితో ఆమె కళ్ళు మెరుస్తున్నై. తారకల్లాంటి ఆమె కళ్ళలోకి ఆ కాంతిని తెప్పించిన తన జన్మ ధన్యమైందనుకున్నాడు శేషగిరి

"రేపేనా! రేపు తప్పకుండా గంటలు మోగిస్తారుకదూ!" అన్నది ఉష ఉత్తేజంగా.

"అవును. రేపే! ఉదయం సెకెండవరు జరుగుతున్నపుడు!" లని శేషగిరి రెండో సీనులో హీరోలా రీవిగా నిష్క్రమించాడు. కాని హీరోలందరివలెనే ఎదురింటి కిటికీలోంచి నిప్పులు గక్కుతున్న రెండు కళ్ళను గమనించలేదు.

*     *     *

రెండు వీధులు దాటేవరకూ శేషగిరిని పట్టుకున్న ధైర్యం వదల్లేదు. ఛాతీ విరుచుకుని 'మన కెవరేం లెక్క?' అన్నట్టుగా రీవిగా నడిచాడు. కాని, మూడోవీధి మలుపు తిరిగేటప్పటికి అతడి ధైర్యం సడలి వడలిపోనారంభించింది. తనేదో గొప్పగా హీరో కార్య మొహటిచేసేద్దామనుకున్నాడుకాని ముఖ్యమైన లోపమొకటి గమనించలేదు. మహావీర కార్యాలుచేసిన సాహసికులందరికీ ఓ పేదరాసి పెద్దమ్మో, ఓ దేవతో, ఓ మహర్షో—ఎవరో ఒకరు సాయంచేసేవారు. కాని తనకి సాయంచేసేవారెవరు? పైగా ప్రిన్సిపాల్ ఆకారం తలచుకునేసరికి అడుగులే తడబడినై. మనసులో పెద్ద గాయమై గేయంగా బయుట పడింది.

కాని రేపో? నా ఊహాంచల
సాహసికాంశం పీడిన
నా చేతులు యత్నిస్తాయా?
నే నేదో స్విచ్చి వేస్తానని
ఆవేయడంలో గంటలు మ్రోగి
ప్రిన్సిపాలు గుండెలు ఘూర్ణిల్లగ
నా ఉషాదేవి వీనులలో మంత్రంగా ప్రమోగించాలని
నా ఆకాశాలను ఆఫీసుకు చేరువగా
నా క్లాస్మేట్సంతా పంచుకునే
తలపుల నవ్వుల జడిగా . . .

అతనికి అకస్మాత్తుగా మరో అయిడియా తట్టింది. ఈ జగదేకవీరుడుకు సాయంచేసే పేదరాసిపెద్దమ్మకోసం తానూ వెదికితే? ఊహ మంచిదేగాని వా రెక్కడ వుంటారో ఆ ఆచూకీ అడ్రసూ తెలియవాయె! అయితే ఒక మార్గముంది. ఓ పేదరాసిపెద్దమ్మకోసం పేపర్లో ప్రకటన వేయించొచ్చు.

"కావలెను. ఒక కళాశాల విద్యార్థికి ప్రిన్సిపాలుకు తెలియకుండా బెల్ స్విచ్చి నొక్కుటకు సహాయముచేయ, లేక ఉపాయము చెప్పగల ఒక పేదరాసిపెద్దమ్మ కావలెను. మంత్రశక్తితో మనుష్యులను దోమలుగ మార్చగలుగువారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వెనుకబడిన తరగతులవారికి ప్రత్యేక కేటాయింపులేదు. ఈ క్రింది అడ్రసుకు తమ శక్తుల వివరములు తెలుపుచూ రహస్యముగ జాబు వ్రాయవలెను. ఫలానావీధి, ఫలానా వూరు"

కాని ఈ ప్రకటనను ప్రిన్సిపాల్ చూస్తే? తన రహస్యం పసికట్టేసి, కాలేజినిండా డి. డి. టి. జల్లించాడంటే తన ఆట కట్టయిపోతుంది. కాబట్టి ఈ ఐడియా కూడా పనికిరాదు. పోనీ ఏంజెద్దామన్నదీ తోచలా! ఛీ మానవుడెంత అవివేకి! రెండు క్షణాలు ఓ స్త్రీ మొహంలోకి సంతోషం తెప్పించడంకోసం ఎన్ని అవస్థలు పడుతున్నాడు! ఓ నారీరత్నమా! నీవు మమ్మెన్ని సాహసములలోనికి దింపితివి! చివరి కెన్ని కష్టములను కల్గించితివి!

రూముకిపోయి కూర్చునేసరికి శర్మ అడిగాడు "ఏరా? బ్రదర్ కృతజ్ఞత లభించలేదా, ఏం? ముఖం వేలాడేశావ్?"

"ఏం చెప్పనోయ్! పెద్ద చిక్కొచ్చిపడింది" అన్నాడు దీనంగా శేషు.

అబ్బాయి:-తొందరగా పదండి సార్! మా నాన్నకీ, పక్కింటాయనకీ బాగా పోట్లాట నడుస్తోంది. అర్థమైంది. కొట్టుకుంటున్నారు.

పోలీసు:-అర్థగంటనుండి పోట్లాట సాగుతోంటే, మరి ఇంతసేపు ఊరుకొని ఇప్పుడొచ్చావేం.

అబ్బాయి:-ఓ అదా! ఇందాకా మా నాన్నే పక్కింటాయనను కొట్టాడండి. ఇప్పుడు మా నాన్న తన్నులు తింటున్నాడు అందుకని.

యస్. నారాయణరావు
(పంగిబురాఖ్ – హైద్రాబాద్)

"ఏవిటేవి"టని శర్మా, వర్మ లిద్దరూ కుతూహలం వ్యక్తపరిచారు.

శేషు కథనంతా క్లుప్తంగా వివరించారు. అంతా విని శర్మ "అంత తొందరపడి గంట కొట్టేస్తానని ఎలా అన్నావురా?" అనడిగాడు.

వర్మ అన్నాడు : "ఏదో ఆవేశాల్లో! అమ్మాయిల ముందా మాత్రమైనా డబ్బాలు కొట్టకపోతే ఎలా?"

"అనకండా ఎలా వుండగలనోయ్! అందమైన అమ్మాయి ఎంతో మురిపెంగా అడుగుతోంది. ఆ క్షణంలో గంగలో దూకేయమనినా అంతపని చేసుండేవాణ్ణనుకో!"

"సరే! ఏదో అనేశావులేగానీ రేపు మెదలకండా కాలేజి చెక్కేసి రూంలో కూర్చో. నీ కూష్మ మొచ్చిందని ఆ అమ్మాయికి వినబడేలా కాలేజీలో చెబుతాలే!" అన్నాడు శర్మ.

వర్మ, "అవున్రా శేషూ! ఎంచక్కా రేపు హాయిగా గదిలో కూర్చోరా. కావాలంటే నేనూ నీతోపాటే ఉంటాను. క్రి.ప్రా.కా. చదువుకుందాం ఇష్టమైతే" అన్నాడు.

"వరే! జ్వరంకాదుగదా! ఎంత దారుణమైన జబొచ్చినాసరే, రేపాస్విచ్చి నొక్కాకనే మిగతా పనులు చూడ్డం" అన్నాడు శేషు మాటల్ని జాగ్రత్తగా తూస్తూ.

"ఆపని చేశావంటే కాలేజి వదిలేస్తావ్" అన్నాడు శర్మ

"చేయకుంటే పరువు నాశనం" అన్నాడు శేషు.

"ఏం ఉపాయంలేదూ!" అనడిగాడు వర్మ.

"నాకేం తోచటంలా!" శర్మ జవాబు.

"అంతేనంటావా?"

"అంతే!"

"ఒ......లే!......శే....షూ!......అంతే.... . . తేనేవిట్రా!" అన్నాడు వర్మ గుడ్ల నీరు తిప్పుకుంటూ.

"అంతేరా!" అన్నాడు శేషు జేబురుమాలు బయటికి తీస్తూ.

"ఒరే శర్మా!"

"ఏరా వర్మా?"

"మన. . . . .శేషు... . ."

"మన శేషు?"

"శేషురా!. . . ." అన్నాడు దుఃఖాన్ని పట్టలేక.

"శే షేవిట్రా?"

"ఉషాదేవి. . . . ."

"సరిగా చెప్పి యాడవరా!"

"అదేరా!"

"అదేవిట్రా?"

వర్మకి అంత దుఃఖంలోనూ కోపమొచ్చింది. "చంపేస్తా న్రా నిన్ను! చెప్పేది సరిగా వినవేం?" అన్నాడు.

శర్మ విసుక్కున్నాడు : "ఛ అరవకు! మాంచి అయిడియా వస్తోంది" అన్నాడు.

"ఆఁ! అలాగ్గా! రానీయ్, రానీయ్" అన్నాడు వర్మ బస్సు వెనక్కి వస్తోంటే కండక్టరన్నట్టుగా.

"ఒరే! కాలేజిలోని బెల్‌ను ఎందుకు కొట్టాలిరా నువ్వు?" అనడిగాడు శేషును శర్మ.

"ఎందుకేవిటి! ఉషాదేవికి మాటిచ్చాను. పైగా ఆమె మెప్పు సంపాదించుకుని ఆపైన ఆమె

తెలుగు పత్రికలన్నిటిలో 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' సర్క్యులేషన్ అధికమైనది

**తొలకరి చినుకులు**




జ్ఞాపకమున్నదా–మండు టెండలకు మాడి పోయిన పిపాస పీడిత భూతలంబున తొలకరి చినుకులు వెల్లివిరిసిన సుమజాలంబు పగిది విదజల్లిన సుదినం? ఆ వుదారశీతల తుషారధారలకు భూదేవి మనోల్లాసం పొంగి పొరలినది. అట్టి నిర్మల శీతల మనోల్లాసమును లక్మె టాల్కమ్ పౌడర్ వల్ల మీరనుదినంబును పొందగలుగుదురు ప్రాతఃకాలపు స్నానానంతరం శరీర మంతటా లక్మె టాల్కమ్ పౌడర్ రాసుకొని రోజల్లా సువాసనతో హాయిగా ఉండగలరు.

సౌందర్యకర
హిమబిందువు
లక్మె

లక్మె ఒక టాటా ప్రోత్సాహితము

LKY-13T-TEL


## ఘంటారావం

హృదయంలో చోటు దక్కించుకోవాలన్నా అదే మార్గం" అన్నాడు శేషు.

"శభాష్ మిడతంభొట్లూ! దొరికావు" అన్నాడు శర్మ

"దొరికాడా? నిజంగానే?" వర్మ ప్రశ్నించాడు

"దొరక్కేంచేస్తాడు? అబ్బాయ్ శేషూ! నిన్న ఉషాదేవి ప్రేమించాలి కాని బెల్లు నీవు కొట్టకూడదు శిక్ష నీకు పడకూడదు సరే! అలాగే కానీ! ఇహ నే జెప్పేది జాగ్రత్తగా విను రేపు నువ్వు కాలేజికి రావద్దు"

"రావద్దా?"

"రావద్దు అంటే క్లాసుకు రావద్దు అన్నమాట. ఇంట్లోనే వున్నానని ఎలిబీకోసం కాని నువ్వు లేడీస్ వెయిటింగ్ రూంకెళ్ళే దారిలో నించొనివుండు"

"సరే వుంటాను"

"ఫస్టవరు అయిపోగానే గంట మోగుతుందికదా! అదయిపోయాక కాసేపటికి మరోగంట మోగుతుంది రెండో అవరు మధ్యలోనే మోగుతుందన్నమాట! ఆ గంట వినగానే అందరూ బయటికి వస్తారా! నువ్వు ఉషాదేవిని ఒంటరిగా కలుసుకొని "నేనే ఆ గంటకొట్టాను" అని చెప్పెయ్!"

"ఆ గంట ఎవరిచేత కొట్టిస్తావ్?"

"ఎవరిచేతనయితేనేం? నేనే కొడ్తాననుకో! నీక్కావలసింది ఫలితం మాత్రమే! కాబట్టి నే జెప్పినట్టు చెయ్! జ్ఞాపకముందా?"

"ఉందిగాని శర్మా! కాస్త ఆలోచించరా? ఎక్కడన్నా అపాయం జరిగితే కష్టం" అన్నాడు శేషు

"ఏం భయంలేదురా! మనం స్కానువేశామంటే ఎక్కడా లొసుగులనేవే వుండవ్ నే చెప్పినట్టుగా మొదటిగంట అయిపోయాక రెండోగంట వినగానే ఉషాదేవి దగ్గరకెళ్ళి ఆ గంటను నువ్వే కొట్టినట్టు చెప్పెయ్! సరా?" అన్నాడు శర్మ కరతాళధ్వనులకోసం ఆగిన వక్తలా చుట్టూ చూస్తూ.

"సరేలే" అని గునుస్తూ ఒప్పుకున్నాడు శేషు.

"నా కేమంత సరిగా కన్పించలా!" అని వర్మ విమర్శించాడు

* * * *

కాలేజి కాంటీన్‌లో శర్మ టిఫిన్ తినేసి, కాఫీ రసంబు సేవిస్తోంటే ఓ చెయ్యి అతడి బుజం మీద పడింది వెనకాలనుంచి "ఇలా వస్తావా?" అని పిలిచింది ఆ చేయి తాలూకు ధ్వని. అంటే చేతికి ధ్వని వుంటుందనికాదు ఆ చేయి తాలూకు శాల్తీ తాలూకు కంఠం తాలూకు ధ్వని అన్నమాట

"వా రెవా!" అనుకున్నాడు శర్మ తనలో ప్రకాశముగా మాత్రం "ఒక్కక్షణం" అని కౌంటర్ దగ్గిరకెళ్ళి ముడుపు చెల్లించుకుని వచ్చాడు. బయటికొచ్చి "ఏవిటోయ్ రఘునాథ్! ఏవిటి విశేషం?" అని ప్రశ్నించాడు తనని ఆహ్వానించిన అవతారాన్ని.

రఘునాథ్ అనబడే ఆశాల్తీ ప్రశ్నించింది: "మీరూంలోవుంటాడే, వాడెవడోయ్?" అని.

"చూడబ్బాయ్! మనం ఇన్వెస్టిగేషన్ చేస్తున్నప్పుడు శాస్త్రీయంగా నడుచుకోవాలి మనం

లాయర్లంకదూ! అందుకని ఇక ప్రస్తుత విషయానికొద్దాం మా రూంలో ఇద్దరు మానవులున్నారు. వర్మ అని ఒకడూ. . . ."

"వాడు కాదోయ్! ఇంకోడు"

"అయితే వాడు శేషు! శేషగిరికి హ్రస్వం"

"ఆఁ! వాడే! ఊదుకడ్డీ లాసన్నగా జండాకొయ్యలా పొడుగ్గా వుంటాడే! వాడే!"

"నవీనమైన ఉపమాలంకారాలు వాడావుగాని నా కంతగా రుచించలా! సరే! ఇంతకీ ఏవిటి వాడి గురించి దుగ్ధ నీకు?"

"వా డెవడోయ్? వాడి చరిత్రేవిటి? తెల్సుకో దల్చుకున్నాను"

"వాడా? వాడొక రోమియో!" అన్నాడు శర్మ వాడి కళ్ళలోకి తీక్షణంగా చూస్తూ. "ఈ నగరంలోని ప్రముఖ ప్రేమికుల్లో ప్రథముడు" అన్నాడు వివరంగా చెబుతూ.

రఘునాథ్ చిన్నబుచ్చుకున్నాడు హిట్లర్‌ముందు చర్చిల్‌ని పొగిడితే అతడున్నూ ఇలాగే చిన్నబుచ్చుకుని వుండేవాడేమో! "వోహో" అన్నాడు, "ఇట్టి గొప్పవాణ్ణి మరి యెందేగంటివేమీ?" అనే వ్యంగ్య ధోరణి స్ఫురించేట్టు.

"ఫరవాలేదు! అబ్బాయి చురుకైనవాడే! విద్యార్థినులకంతా అత డంటే ఒక రకమైన మోజు" అన్నాడు శర్మ దెబ్బమీద దెబ్బవేస్తూ. ఇనుము ఎర్రగా వుండగానే నాలుగు దెబ్బలేయాలనే సిద్ధాంతాన్ని అతడు మనస్ఫూర్తిగా అంగీకరిస్తాడు.

రఘునాథ్ అనుమానంగా అతడివంక చూశాడు. "బ్రదర్ శర్మా! నీతో ఒక రహస్యం మాటాడాలి!" అన్నాడు.

"చెప్పవోయ్!"

"వీడున్నాడే నీ రూమ్మేటు. చాలా అపాయకరమైనవాడు. వాణ్ణి నా మార్గంలోంచి తొలగించా లనుకుంటున్నాను" అన్నాడు పెదిమెలు బిగబట్టి రఘునాథ్.

"అబ్బే! వాడు నీకు అడ్డంరాడు. నీవు మెయిన్ రోడ్డమ్మట వెళ్తూంటావ్ వాడు చల్లావారి వీధిలో వెళ్తుంటాడు" అన్నాడు శర్మ

"నా అభిప్రాయం తెలుసుకోలా నువ్వు నీ దగ్గర దాపరికమెందుకు? నేను ఉషాదేవిని ప్రేమిస్తున్నాను. అందుకోసమే వాళ్ళింటి కెదురుగానే గది అద్దెకు తీసుకున్నాను వీడు ఈ మధ్య ఉషాదేవి యింటికొచ్చాడు. . . . ."

"అవునవును ఆమె మళ్ళీ రేపో ఎల్లుండో రమ్మన్నదని కూడా చెప్పాడు"

రఘునాథ్ కోపంగా వాడికేసి చూశాడు "హా! అలాగన్నమాట వెళ్దామనుకుంటున్నాడా! సరే!! వాణ్ణి ఎలాగైనా నా మార్గంనుండి తొలగిస్తాను. ఏమేనా చేస్తాను. నే నేమైపోయినాసరే వాణ్ణిమట్టుకు తొలగిస్తాను" ముఖం జేవురించుకుని గుడ్లలో నీళ్ళు తిరిగేలా గట్టిగా అన్నాడు

శర్మ గట్టిగా నవ్వాడు "ఓయి వెర్రబ్బాయీ! ఇంత బాధపడతావెందుకోయ్! అసలు నీ పద్ధతి తప్పు అట్నుంచి నరుక్కురమ్మన్నాడు గురజాడ. నువ్వు అమాంతం అనువైన అమ్మాయిని ప్రేమించేసి ధాటీగా వాళ్ళో తిరిగెయ్యగానే సరిపోతుం దనుకున్నావా? ఆమె ప్రేమను రాబట్టుకోడానికి నువ్వేంజేశావ్?"

"ఏం చేయాలి?" ఆశ్చర్యంగా అడిగాడు రఘునాథ్

"వెర్రివాళ్ళా అడుగుతావేంటోయ్! ఆ అమ్మాయి నిన్ను ప్రేమించాలంటే నీవు సాహసకృత్యాలు చేయాలి ధైర్యవంతుడివని నిరూపించుకోవాలి. ఉదాహరణకు ఉషాదేవే వున్నదనుకో! పీరియడ్ పూర్తి కాకుండానే ఎవరేనావెళ్ళి విద్యుద్ఘంటయొక్క మీట నొక్కారంటే ఆమెకు సంతోషంట! ఈ విషయం నే దెలుసుకున్నాలే! ఇటువంటి పరిస్థితుల్లో నీవే రేపు మొదటిగంట అయిపోగానే సెకండవరు మధ్యలో స్విచ్చి నొక్కేసి, తర్వాతెప్పుడో తీరిగ్గా "ఉషాదేవీ! నిన్న సెకండవరు మధ్యలో స్విచ్చి నొక్కింది నేనే!" అనేశావనుకో! అప్పుడు నీవంటే అమాంతం ఆమె కెక్కడలేని ప్రేమ పుట్టుకొస్తుంది మరే మగపురుగువంకా కన్నెత్తి చూడదు"

రఘునాథ్ నోరు తెరుచుకొని వింటున్నాడు. దీన్నే గనుక ఆసనాల లిస్టులో చేర్చితే "ఉన్మీలిముఖాసనము" అనవలసి వస్తుంది కాసేపటికి తెప్పరిల్లి "బావుందోయ్! అయిడియా!!" అన్నాడు.

"నీవంటే నాక్కాస్త అభిమానముంది గాబట్టి యీ మంచి అయిడియాను నీకు చెప్పానోయ్! మరెవరేనా అడిగితే చెబుతానా ఏవిటి?" అన్నాడు శర్మ

"చాలా థాంక్సోయ్! అయిడియా చాలా బావుంది"

"అయిడియాను ఒహటే మెచ్చేసుకుంటే ఏం లాభమోయ్?"

"అయిడియా బావున్నప్పుడు అయిడియా బావుందని అనకపోతే ఎలాగోయ్?"

అయిడియా బావుందిసరే! మెచ్చుకున్నావు సరే! అంతేనా?"

"మెచ్చుకుంటే వూరికే మెచ్చుకున్నానా! అయిడియా బావుంది కాబట్టి!"

---

ఉద్యోగంకోసం తిరిగి తిరిగి నిరాశచెందిన ఒక యువకుడు ట్రేజడీ హీరో పోజుపెట్టి ఒక సినిమాపాట జాలిగా పాడుకుంటూ పోతున్నాడు.

"ఆకాశాన్నందుకునే ధరలొక వైపు--అదుపులేని నిరుద్యోగ మింకొకవైపు.

"అవునవును--చీముల బారుల్లాగ విడుదలయ్యే యీ సినిమాలొకవైపు." అన్నాడు అది విన్న ఒక పెద్దమనిషి.

సి. వి. ఆనందశర్మ (భీమునిపట్నం)

---

"అవునోయ్ అయిడియాను ఆచరణలో పెటా లంటాను!"

"ఓ అదా! అయితే అయిడియాను ఆచరణలో పెట్టాలంటావ్?"

"తప్పక"

"వెంటనే నీవు చెప్పినట్టు చేసేయాలంటావ్?"

"అంతే!"

"ఎప్పుడైతే బావుంటుందంటావ్?"

"రేపే!"

"ఏ పీరియడ్ అయితే అనువుగా వుంటుందంటావ్?"

"చెప్పానుగా!"

"కాని భయమేస్తోందే! ఏమన్నా అయితే!"

"ఏమవుతుందోయ్? ఆలోచించు!! ఆఫీసులో ఎవ్వరూ లేకుండాచూసి ఓ క్షణంపాటు స్విచ్చి నొక్కేస్తావ్ తర్వాత మెల్లగా జారుకుంటావ్! ఆనక తీరుబాటుగా ఉషాదేవిని కలుసుకొని "హల్లో ఉషా! నేనే ఫలానా రోజున అవరు మధ్యలో గంట కొట్టింది. అంత భూకంపం పుట్టించిన వీరుణ్ణి నేనే! నీవోటు నాకే!" అని చెప్పేస్తావ్. అంతే!"

"నిజమేలే! అయినా కాస్త అపాయం లేదంటావా?"

"ఉందనుకో! కాని సాహసించాలి! ఉషాదేవి లభిస్తుంది" రఘునాథ్ ఓ క్షణం తటపటాయించాడు ఆఖరుకు "రైట్! రేపే!" అన్నాడు.

"ఏవిటి? రేపే చేస్తావా?"

"ఓ యస్!"

"రేపు రెండో అవరు మధ్యలోనేనా?"

"యస్, యస్!"

"ఆఖరు క్షణంలో భయపడ్తావేమో?"

"నో, నో!"

"మరి అపాయం మాట?"

"సాహసం చేయాలి! ఉషాదేవి లభిస్తుంది!"

"వెరీగుడ్! అదీ మంత్రం! మర్చిపోవద్దు రేపు ఉదయం రెండో పీరియడ్ జరుగుతున్నప్పుడు. ఇక వెళ్ళిరా!" అని రఘునాథ్‌ని తోలేశాడు. వాడు ఉషారుగా వెళ్ళిపోయాడు. శర్మ "తదేకదృష్టి ఆసనము" వేయడంలో నిమగ్నుడైపోయాడు.

* * *

ఉషాదేవి కిటికీదగ్గర కూర్చుంది. రివ్వున సముద్రపు గాలి వీస్తూ, ఆమె మొహమ్మీది ముంగురుల్ని చీకాకు పరుస్తోంది రెండో అవరు "కాంట్రాక్ట్స్" బోరు కొడుతోంది సారం ఆమె వినిపించుకోవడంలా కిటికీలోంచి వెలుపలికి చూస్తోంది. అక్కణ్ణుంచి ఆమెకు కాలేజి ఆఫీసురూం కనబడుతుంది. ఆఫీసులో ఎవరూ ఉన్నట్టు లేదు. ఇంతలో ఒక వ్యక్తి ఆ గదివేపేరావడం ఆమె దృష్టిని ఆకర్షించింది. అత డేదో తప్పు చేసిన వాడిలాగా భయం భయంగా వస్తున్నాడు ఆఫీసు గదిలోకి అటూ ఇటూ చూసి మెల్లిగా గోడమీది స్విచ్చివేపుకి చేయి చాచాడు. మళ్ళీ చేయిదించి గుమ్మం దగ్గరకొచ్చి అటూ యిటూ చూశాడు. ఈ సారి ధైర్యంగా గోడ దగ్గరికొచ్చి స్విచ్చివేపుకి చేయి చాచాడు. ఉషాదేవి సంతోషంతో కళ్ళు మూసుకుంది.



## పూవు మీ అదృష్టం చెప్పగలదు.

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామా యున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1 4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా భూచీపైనపంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయుబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt DevDutt Shastri, Raj Jyotishi (WP 13) Jullundur City.


# ఘంటారావం

ప్రిన్సిపాల్ ఆరోజ చాలా హడావుడిగా వున్నాడు. తన కాలేజికి అఖిలభారత కళాశాలల క్రమశిక్షణా పరిశీలక సంఘం వచ్చింది. ఆ సంఘంవారు కళాశాలను మొదటి గంట పరిశీలించారు. సెకెండవరు ప్రిన్సిపాలు వార్ని గదిలో కూర్చుబెట్టుకొని లెక్చరు ఇస్తున్నాడు.

" . . . కావున గౌరవనీయులైన అ. భా. క క్ర. ప సం. సభ్యులారా! మా కళాశాలలో క్రమశిక్షణా రాహిత్యానికేమీ అవకాశంలేదని ఘంటాపథంగా చెప్పగలను. . . ."

ఎలక్ట్రిక్ బెల్ రింగున మ్రోగింది కాలేజి అంతటా ఆ ధ్వని ప్రతిధ్వనించింది.

ఒకేక్షణంలో బిలబిలమంటూ విద్యార్థులు బయటికి వచ్చేశారు. అందరూ క్లాసులు మారడానికి పూనుకున్నారు.

అదే సమయంలో ఉషాదేవి వెయిటింగ్ రూము వేపు వెడుతోంది. ఆమెను కలుసుకోడనికి శేషు వెడుతున్నాడు వాణ్ణి వెంట తరుముకుంటూ శర్మ వస్తున్నాడు. కాని అతణ్ణి శేషగిరి గమనించలేదు ఆదర్శ పురుషు లిటువంటివారేకదా! తమ ధ్యేయాన్ని స్మరిస్తూ, చుట్టుపట్ల జరిగే అముఖ్య సంఘటనలను గమనించరు

శేషు నేరుగా ఉషాదేవి మార్గానికడ్డంగా నిలబడి "ఉషాదేవీ! ఇప్పుడు బెల్‌కొట్టింది నేనే!" అన్నాడు. ఆమె వాచి చూసుకుంది సరిగా పన్నెండు గంటలయింది కోపంగా అతడివంక చూసింది. శేషు మరింత ధీమాగా "అవునండీ! నేనే ఈరోజు ఇప్పుడు గంట కొట్టాను" అన్నాడు ఆమె మాటాడలేదు ఆమె మొహంలో కోపమూ, అసహ్యమూ నృత్యం చేశాయి మొహాన్ని ఎర్రగా జేవురింపజేసుకుని గిరుక్కున ప్రక్కకు తిరిగి వెళ్ళిపోయింది.

శేషు ఆశ్చర్యపోతూ, ఆమె వెళ్ళిన దిక్కుకే చూశాడు. ఆమె ఎందుకో తనను అసహ్యించుకున్నదని మాత్రం గ్రహించుకున్నాడు. అయిపోయింది! ఇక తన జీవితంలోని ఆశాజ్యోతి ఘనమైపోయింది నిరాశగా వెనక్కి తిరిగాడు. ఎదురుగా శర్మ నిలబడి వున్నాడు

"చవటా!" అన్నాడు శర్మ. శేషుకు అర్థం కాలేదు "ఏవిటీ?" అనడిగాడు.

"చవటా!" అన్నాడు శర్మ మళ్లీ ఇది రెండో దెబ్బ అసలే ఉషాదేవి చూపుతో క్రుంగిపోయి వున్న శేషు మనస్సు ఈ మాటతో మరింత క్రుంగిపోయింది ఇలాటి శర్మగాళ్ళు ఇలా వందలూ, వేలూ పుట్టుకొచ్చి ఎక్కడబడితే అక్కడ నిలబడి తనని తిట్టడనికెందుకు ప్రారంభిస్తారో అతడికర్థం కాలేదు.

"నువ్వు చెయ్యమన్నట్టే చేశాగా!" అన్నాడు శేషు నేరం వాడిమీదకే తోసేద్దామని.

"చెయ్యమంటే కాస్త కామన్‌సెన్సు ఉపయోగించొద్దా! ఆ రఘునాథ్‌గాణ్ణి పీరియడ్


# రెక్స్ జెల్లీ



## కంటికింపైనది..మంచిరుచియైనది..చాలామంచిది!

ఇదిగో పళ్లరుచిగల ఫలహారము, దీనిని తయారుచేయుట ఎంతో సులభం. రెక్స్ జెల్లీ క్రిస్టల్సును వేడి నీటిలో కరిగించండి. తరువాత 1. పైంటు (20 ఔన్సులు) అగుటకు కావలసినంత చన్నీళ్లు కలపండి. దానిని ఒక అచ్చులోపోసి జెల్లీ గట్టిపడువరకూ మంచు గడ్డ మీద వుంచండి.
అది సులువుగా జీర్ణమయ్యే పుష్టికరమైన ప్రీతియగు ఇంటి ఫలహారము, కోలుకుంటున్న రోగులకు కూడా దివ్యమైనది.
రెక్స్ జెల్లీ క్రిస్టల్స్ 6 రుచులలో లభించుచున్నవి: రాస్ బెర్రీ, స్ట్రాబెర్రీ, లెమన్, పైనాపిల్, ఆరెంజ్, చెర్రీ.




కార్న్ ప్రాడక్ట్స్ కో., (ఇండియా) ప్రయివేట్ లి.
దక్షిణ భారతదేశంలో ఏజెంట్లు: ప్యారి అండ్ కంపెనీ, లిమిటెడ్

మధ్యలో గంట కొట్టమంటే ఆఫీసు రూము వరకూ వెళ్ళి, భయపడి తిరిగి వచ్చేశాడు. ఇది మామూలుగా రెండో అవరు అయిపోయినప్పుడు కొట్టే బెల్. నే ననుకున్న ప్లానంతా భగ్నమయింది. పోనీ నీవైనా ఊరికే వుంటావంటే కాస్తయినా గమనించుకోకుండా మహావీరుళ్లా ఉషాదేవితో "నేనే ఈ గంట కొట్టా"నని చెప్పేశావు ఇక ని న్నామె ఎంతగా అసహ్యించుకుంటుందో వేరే చెప్పాలా?"

శేషు, "ఏం చేయను? నా దగ్గర వాచీలేదు" అన్నాడు.

"సరేలే! నాదే తప్పయిపోయింది. పద రూముకి పోయి కొత్త ఆలోచన చేద్దాం"

"నేరాను!" అన్నాడు శేషు.

"విసిగించక రావోయ్! మంచి అయిడియా తడుతోంది!"

"నీ అయిడియాలు నువ్వేదాచుకో! నా కక్కర్లేదు"

"సర్లే! ముందు రూముకి పద"

"నే రాను!" శేషు మొండి కెత్తాడు.

"ఇదొక్కసారీ వినవోయ్! దారుణమైన అయిడియా తట్టేసింది. ఈ దెబ్బకు నీ రొట్టె విరిగి నేతిలో పడుతుంది" అని శర్మ బ్రతిమాలుకున్నాడు. కాని శేషు వినలా. ఇంతలో వర్మ అక్కడి కొచ్చాడు.

శర్మ చేసేదిలేక వర్మకేసి చూసి "చూడరా భాయ్! నీవేనా కాస్త సాయం చేయ్!" అన్నాడు. కథనంతా తెలుసుకొని వర్మ ఇలా అన్నాడు: "నాదేమంత మంచి బుర్ర కాదనుకో! పెద్ద అయిడియాలేమీ రావు. కాని ఇప్పుడు నాకు తోచిన ఒక అయిడియా వినిపిస్తాను. మీకు బావుందనితోస్తే అనుసరిద్దాం వినండి!" అన్నాడు.

* * *

మరుచటిరోజు ప్రొద్దున్నే శర్మ ఉషాదేవి ఇంటికొచ్చాడు. ఆమెను పిలిచి "ఏవండీ! చూశారా! ఘోరం జరుగబోతోంది. మా శేషగిరి ఉదయానే గదిలోకెళ్ళి తలుపేసుకున్నాడు తెరవమంటే తెరవకుండా వున్నాడు. "ఉషాదేవి నన్ను అసహ్యించుకున్నాక నేను బ్రతికేంలాభం?" అన్నాడు ప్రొద్దున్నే. నిన్న రాత్రే ఒక పిస్తోలు కూడా తీసుకొచ్చి టేబిల్ డ్రాయర్లో పెట్టుకున్నాడండీ! ఏం చేస్తాడోనని భయంగావుంది! పాపం నిన్నరాత్రి భోంచేయలేదు కూడానూ!" అన్నాడు ఆందోళనగా

ఉషాదేవి మొహంలో భయ చిహ్నాలు స్పష్టంగా పొడకట్టినై. "అయ్యో! ఘోరాన్ని జరగనీయకండి! నే చెప్పాననిచెప్పి, యిక్కడికి తీసుకురండి!" అన్నది తానూ ఆందోళనని వ్యక్తం చేస్తూ.

"నే జెబితే వస్తాడని నాకేం నమ్మకం లేదండీ! మీరేవచ్చి వాణ్ణి యిక్కడికి పిలుచుకొని రాకపోయారంటే ఏదో ఒక క్షణంలో వాడు ఘోరకృత్యాన్ని చేసేస్తాడు. తర్వాత మనం విచారించి లాభం వుండదు" అన్నాడు.

ఉష కాసేపు తటపటాయించింది. చివరికి "సరే! పదండి! నేనే వచ్చి యిక్కడికి తీసుకొస్తాను" అని శర్మతో బయలుదేరింది.

అదృష్టవశాత్తూ వీధి కవతలవున్న మేడమీది గదిలోకి ఈ మాటలేవీ వినబడలేదు. కానీ ఆ దృశ్యాన్ని మాత్రం నాలుగు కళ్ళు పరిశీలిస్తూనే వున్నయ్.

వా రిద్దరూ వెళ్ళిపోయాక వర్మ రఘునాథ్ తో అన్నాడు: "చూశావుటోయ్! రఘూ! ఇదీ వరస! నే జెబితే నువ్వు నమ్మలేదుగానీ, వాళ్లిద్దరూ—అంటే మన శేషూ, శర్మలు—కలిసి నిన్ను అపాయంలో యిరికించాలని చూశారు. నువ్వే గనక తొందరపడి గంట కొట్టివుంటే ఏమయిపోయేవాడివో!! వాళ్ల స్వార్థంకోసం నిన్ను బలిపెట్టాలని చూశారు. అదృష్టవంతుడివి కాబట్టి తప్పించుకున్నావ్!"

"ఇంతకీ ఆ శేషుగాడు ఉషాదేవి నెలా మాయ చేయగలిగాడంటావ్?"

"శేషు ఎంత దుర్మార్గుడయినా అఖండుడోయ్! మనకి వాడంటే ఎంత గిట్టకపోయినా, యిది మాత్రం వప్పుకు తీరాలి. ఏం మచ్చుమందు జల్లాడో మరి! ఉష వాడంటే ఎంత ఆతురుత పడుతున్నదీ చూశావుగా!"

ఇంతలో ఉషాదేవి శేషగిరిని వెంటపెట్టుకుని వచ్చింది. శర్మ వారిని గేటు వరకూ సాగనంపాడు.

"చూశావా! చూశావా!! ఒకటేసారి వెంటబెట్టుకునే వచ్చేసింది శేషుని! ఇక లాభంలేదు. పరిస్థితి చేయి జారిపోయింది" అన్నాడు వర్మ.

రఘునాథ్ గట్టిగా కిటికీ తలుపుని విసిరి కొట్టాడు. కోపంతో ఎర్రబడి "ఈ వెధవ గదిలో నే నొక్క క్షణం కూడా వుండను!" అన్నాడు.

"అవునోయ్! వెంటనే గది మార్చెయ్! ఇక్కడుంటే ఊరికే బాధ పడతావు కూడాను! వేరే గదికి మారితే కాస్త మనశ్శాంతి అయినా లభిస్తుంది!" అన్నాడు వర్మ "మరిక నే వస్తానూ! పనుంది!!" అని శెలవు పుచ్చుకున్నాడు.

రోడ్డుమీద శర్మ వాణ్ణి కలుసుకున్నాడు "ఏమిరా శల్యుడా! పరిస్థితి ఎలావుంది!" అనడిగాడు.

"సంతృప్తికరంగానేవుంది" అన్నాడు వర్మ

"ఇక మనవాడి జోలి రాడుకదా!"

"ఊహూ!"

"వెరీగుడ్! ఇంతకీ చాల గొప్పవాడివిరా నువ్వు!" శర్మ మిత్రుణ్ణి అభినందించాడు

"నాదేం గొప్పతనంలేరా! ఏదో అనుకున్నట్టు జరిగిపోయింది!" అన్నాడు వర్మ.

"ఇంతకీ మన శేషువున్నాడే. . . ." శర్మ ప్రారంభించాడు.

"అవున్రా! వాడు అదృష్టవంతుడు" అని వర్మ ముగించాడు. ☆


## తెల్లని మచ్చలు

మాయొక్క అమితశక్తియు & గొప్ప ఫలమునొసంగు డాగ్ సోఫా బూటీ వాడినకొద్దిగో జులలో నే తెల్లమచ్చలను పోగొట్టి మామూలు చర్మపు రంగుకు మార్చగలదు. ఒకసారి ప్రయత్నింపుడు.

ధర రూ. 15/-

Kast Niwaran
Aushadhalaya (A)
P. O. Katri Sarai (Gaya)



## మీకు ఉచితం

"ప్లాన్డ్ ఫేమిలీస్". భర్తలు, భార్యలు నూతన వధూవరులు, అందరూ చదివి తీరవలసిన చిన్ని పుస్తకము. అప్పుడు మీరు మీ కుటుంబమును కావలసిన పరిమాణమునకు రూఢిగా నియంత్రణ చేసుకో వచ్చును. ఈ పుస్తకము "అనేక కఠిన ప్రశ్నలకు" సమాధానముల నిచ్చును మరియు కుటుంబ నియంత్రణ మీకు సంపద్కరంగా ఎట్లు సహకరింపగలదో స్పష్టముగాను, ప్రామాణికంగాను మీకు తెలుపును.

### ఈ చిన్ని పుస్తకమును మీరు నిర్లక్ష్యింపగూడదు




నేడే ఈ కూపన్ ను పోస్టుద్వారా

ఎల్.డి. సీమోర్ అండ్ కొ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్., డిపార్టుమెంటు M-9 వల్కన్ ఇన్సూరెన్సు బిల్డింగ్, చర్చ్ గేట్, బొంబాయి – 1. "డ్యూరెక్స్" అండ్ "డ్యూరఫక్స్" కాంట్రాసెప్టివ్ లకు ఏజెంట్లు.

"ప్లాన్డ్ ఫేమిలీస్" అను పుస్తకము ఒక ప్రతి ఉచితంగా సాదా కవరులో దయచేసి నాకు పంపండి. నేను వ్యస్తుడను

పేరు.........................................

చిరు నామా.................................

Aiyars LDS/2TL